

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## రెండు మనసులు

**సుజాత** డైనింగ్ టేబుల్ ముందు విచారంగా కూర్చుంది. ఆవిడ మనసంతా బుజ్జిగాడి మీదే వుంది. 'గ్రానీ గ్రానీ' అనేవాడి పిలుపులే చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ప్రతిదానికీ హడావిడి పడే కొడుకు, నిదానంగా ఆలోచించే కోడలు. అంతా ఒక్కసారే వెళ్ళిపోవడంతో సుజాతకి పిచ్చెక్కినట్లుంది.

తన పెళ్ళయిన వెంటనే కొడుకు పుట్టడం, వాడికి ఉన్న ఊళ్ళోనే ఉద్యోగం రావడం, పాతికేళ్ళు రాగానే పెళ్ళయి కోడలు ఇంటికి రావడం, రెండేళ్ళకి బుజ్జిగాడు పుట్టడం... కాలం గిర్రున తిరిగిపోయింది.

పదిరోజుల క్రితం కొడుకు ఆనందంతో ముఖం వెలిగిపోతూండగా ఇంటికి వచ్చి సుజాతని గట్టిగా కుదుపుతూ చెప్పాడు. "అమ్మా! నా డ్రీం కంపెనీలో జాబ్ వచ్చింది. ఎన్ని రోజులనించి వెయిట్ చేస్తున్నానో తెలుసా ఈ ఆఫర్ కోసం? హేపీ, వెరీ హేపీ."

ప్రమాదాన్ని పసిగట్టిన సుజాత ఏమాత్రం సంతోషపడకుండా అడిగింది.

"పోస్టింగ్ ఎక్కడ చిన్నా?"

ఆ ప్రశ్న వినగానే కొడుకు కొద్దిగా తగ్గి చెప్పాడు.

"రాజ్‌కోట్‌లో అమ్మ."

"గుజరాతా?" ఆవిడ తెల్లబోతూ అడిగింది.

"అవును." తప్పుచేసినట్లుగా చెప్పాడు.

"అంటే అమ్మాయిని, బుజ్జిగాడిని తీసుకెళ్తావుగా?" అర్ధం లేని ప్రశ్న వేసింది.

"మరి? రాజ్‌కోట్ పెద్ద ఊరేనమ్మా. అన్ని సౌకర్యాలు ఉంటాయి."

కొడుకు ఆ శుభవార్త చెప్పడానికి కోడలి దగ్గరికి గదిలోకి వెళ్ళాడు.

తర్వాత అన్ని ఏర్పాట్లు చకచకా జరిగిపోయాయి. పదిరోజుల్లో కొడుకు కుటుంబంతో రాజ్‌కోట్ వెళ్ళిపోయాడు.

సందడిగా ఉండే ఇల్లు నిర్మానుష్యం అవడం, అలవాటైన మనవడి మీద దిగులు. పని తక్కువ అవడంతో తీరిక ఎక్కువైన సుజాతకి కాలం గడవడం లేదు.

టేబుల్ మీద తలవాల్చి కూర్చున్న సుజాత జాజిపూల వాసనకి తలెత్తి చూసింది.

చంద్రం తలుపు తీసుకుని లోపలకి వస్తున్నాడు. అతడి చేతిలో పూల పొట్లం.

భార్య మొహంలోని విషాద ఛాయలని గమనించిన చంద్రం బూట్లు విప్పి, చేతులు కడుక్కొచ్చి ఆమె పక్కన కూర్చుని ఆప్యాయంగా అడిగాడు.

"బుజ్జిగాడు గుర్తొచ్చాడా?"

తన దిగులుకి భర్త ఓదార్పు తోడవడంతో సుజాత కళ్ళు తడిసాయి. జాజిపూలమాల తీసి ఆమె చేతుల్లో పెట్టి చెప్పాడు చంద్రం.

"నీకు ఇష్టం కదా?"

సుజాత కదిలిపోయింది. ఎన్నేళ్ళ తర్వాత భర్త తన ఇష్టాల గురించి మాట్లాడుతున్నాడు? పాతికేళ్ళు దాటిందేమో!

చంద్రం లేచి ఆమె వెనక నుంచుని వంగి నుదుటి మీద చుంబించి చెప్పాడు.

"తయారవు సుజా బయటకి వెళ్దాం."

'సుజా!' 'ఏయ్, ఓయ్, ఇదిగో' తప్ప ఈ మధ్య కాలంలో చంద్రం తనని సుజా అని పిలవలేదు.

ఆమె లేచి వెళ్ళి మొహం కడుక్కుని బొట్టుపెట్టుకోబోతూ అద్దంలోని తన మొహం చూసుకుంది. శ్రద్ధలేక చర్మం చిన్న చిన్న ముడతలు పడింది. పాపిట్లో వెంట్రుకలు తెల్లబడ్డాయి. కళ్ళకింద నల్ల చారలు మొదలవబోతున్నాయి.

ఎప్పటికన్నా శ్రద్ధగా తయారై అందులో తను చిన్నదానిలా కనిపిస్తుంది అనే నమ్మకం ఉన్న చీరని సెలక్ట్ చేసుకుని పావుగంటలో బయటకి వచ్చింది.

చంద్రం అప్పటికే తయారై పేపర్ చదువుతూ కూర్చున్నాడు. ఆమెని చూడగానే లేచి ఓ రెండు క్షణాలపాటు ఆమెని ఆలింగనం చేసుకుని చెప్పాడు.

"పద."

పెళ్ళయిన కొత్తల్లో సుజాత తయారవగానే ఆమెని ఆలింగనం చేసుకుని చంద్రం ఆమె మెడకి వేసుకున్న సెంటు వాసనని ఆఘ్రాణించేవాడు. కొడుకు పుట్టాక ఆ అలవాటు పోయింది. మళ్ళీ ఇప్పుడు.

"ఒక్క నిమిషం" సుజాత లోపలికి వెళ్ళి మెడ పక్కన పెర్ఫ్యూమ్ స్ప్రే చేసుకుని వచ్చి చంద్రాన్ని ఇష్టంగా కౌగిలించుకుని చెప్పింది.

"పదండి."

"ఎక్కడికి వెళ్దాం?" కారెక్కాక స్టార్ట్ చేయబోతూ అడిగాడు.

సుజాత తెల్ల మొహం వేసింది.

"మీరు రెడీ అవమన్నారు. అయాను. అంతే. నాకేం తెలుసు?" గొణిగింది.

"చాలా రోజులైంది. మీ తమ్ముడింటికి వెళ్దామా?"

"సరే. అవును వాడిని చూసి చాలారోజులైంది" ఒప్పుకుంది.

"ఇంట్లో ఉన్నాడో లేడో కనుక్కో."

సుజాత తమ్ముడికి ఫోన్ చేస్తే, ఇంట్లోనే ఉన్నానని, రమ్మని చెప్పాడు.

అరగంట దూరంలోని తమ్ముడింటికి వెళ్ళేసరికి అతను ఇంటిబయటే వీళ్ళకోసం ఎదురు చూస్తున్నాడు.

"మనింటికి రావడానికి కూడా ఫోన్ చేసి చెప్పాలా అక్కాయ్" నిష్టూరాలు ఆడుతూ 'రా బావా' అని చంద్రం చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళాడు.

మరదలు, పిల్లలు ఆప్యాయంగా, ప్రేమగా పలకరించారు.

"ఒక ఊళ్ళో ఉన్నామన్న మాటేకాని అక్కాయ్, మనం కలుసుకుని ఎన్ని రోజులైందే?" తమ్ముడు గద్గదంగా చెప్పాడు.

సుజాతకి సిగ్గనిపించింది. నిజమే. తన పరిధి చాలా కుంచించుకుపోయింది. కొడుకు, కోడలు, మనవడు. వీళ్ళ చుట్టే తిరుగుతోంది. ఏదైనా ఫంక్షన్ అయితే పిలవడం, వాళ్ళు పిలిస్తే వెళ్ళడం తప్ప బంధుమిత్రులతో సంబంధాలు లేకుండా అయిపోయింది.

"నిజమేరా అబ్బీ. సారీ" తమ్ముడి భుజంపై చెయ్యివేసి ఆప్యాయంగా చెప్పింది.

"సారీ లెందుకు లేవే. ఇప్పటికైనా మేం గుర్తొచ్చాం చాలు." అతను ఆనందంగా చెప్పాడు.

ఆ తర్వాత బోలెడన్ని కబుర్లు, నవ్వులు, విశేషాలు.. కాలం ఎలా గడిచిందో అర్థం కాలేదు. భోజనం చేసి వెళ్ళండే మేం ఊరుకోమని తినేదాకా బతిమాలి తినిపించారు.

ఇంటికి వచ్చేసరికి రాత్రి పదిగంటలైంది.

"అయ్యో! మీకు రేపు ఆఫీస్ కూడా ఉంది. కొద్దిగా ముందు బయలుదేరాల్సింది." నొచ్చుకున్నట్లుగా చెప్పింది.

చంద్ర నవ్వి చెప్పాడు.

"ఇంట్లోనే ఉన్నా పదకొండుకి ముందు ఎప్పుడైనా పడుకున్నామా?"

సుజాత స్నానం చేసి నైటీ వేసుకుని, పడకగదిలోకి వెళ్ళబోతూ టేబుల్ మీది జాజిమాల తీసుకుని తలలో తురుముకుంది.

మర్నాడు చంద్రం ఆఫీస్‌కి వెళ్ళాక సుజాత ప్రతీ వెంట్రుకని పరిశీలించి హెయిర్ డై వేసుకుంది. పాలమీగడలో పసుపు, శనగపిండి కలిపి మొహానికి ఫేస్‌పేక్‌లాగా వేసుకుంది. బెడ్రూంలోని మంచం మీద ఉన్న దుప్పట్లు, కిటికీ కర్టెన్స్ మార్చింది. ఇల్లంతా శుభ్రంగా, అందంగా సర్దింది. - అచ్చం పెళ్ళయిన కొత్తల్లో సర్దినట్లు. అంతసేపు ఆమె కూనిరాగం తీస్తూనే ఉంది.

రాత్రి పక్కమీద భర్త చెప్పింది గుర్తొచ్చింది.

"నాకు నీ మీద వ్యామోహం తీరక మునుపే నెల తప్పిందని చెప్పావు. ఆ తర్వాత ప్రపంచంలో నువ్వే గర్భవతివి అన్నట్లుగా అతి చేసావు. నన్ను పట్టించుకోలేదు. చిన్నా పుట్టాక ఇక ప్రపంచంలో తల్లివైంది నువ్వొక్కదానివే అన్నట్లుగా చేసావు. నన్ను పూర్తిగా పట్టించుకోవడం మానేసావు. నా అవసరాలన్నీ చూసావు. కానీ ఆ పనుల్లో అతి ముఖ్యమైన ప్రేమ నశించింది. చాలా యాంత్రికంగా ఉన్నావు నాతో. దానికి నేను చాలా హర్ట్ అయ్యాను. మనవడు పుట్టాక వాడు మనతో పడుకుంటాడని చెప్పి మనిద్దరి మధ్యా పడుకోపెట్టడం మొదలుపెట్టావు. అందుకు నా అనుమతి అడగలేదు. కష్టం, సుఖం ఏమైనా మాట్లాడదాం అనుకుంటే, 'ష్.వీడు నిద్రలేస్తాడు' అని వారించేదానివి. ఇంట్లో ప్రైవసీ లేదు. మరి పడకగదిలో కుడా లేకపోతే నాకెలా ఉంటుంది? దాంతో నేనూ నీలా యాంత్రికంగా మారిపోయా. గుర్తు తెచ్చుకో ఒక్కో రోజు మనిద్దరం రెండు మూడు మాటలు కూడా మాట్లాడుకునేవాళ్ళం కాదు. ఒక్క సంతానంతోనే ఇంత తేడా వస్తుందని ఎప్పుడూ అనుకోలేదు. నీ గురించి ఆలోచించవు. ఇంటి గురించి ఆలోచించవు. కొడుకు, కోడలు,

మనవడు. ఇదే నీ ప్రపంచం. దేవుడి దయవల్ల చిన్నా వేరే ఊరు వెళ్ళడంతో మళ్ళీ మనిద్దరమే మిగిలాం. మూడొంతుల యవ్వనం ముగిసిపోయింది. మిగిలిన కొంచెం వయసుని అనుభవిద్దాం నీ గురించి ఆలోచించు సుజా. మీ తమ్ముడు ఏమన్నాడో ఆలోచించు."

ఫోన్ మోగింది. కోడలినించి.

"అత్తయ్యా రోజూ ఈ పాటికి నాలుగైదుసార్లు ఫోన్ చేసేవారు. ఇవాళ అసలు చేయలేదు. హెల్త్ ఓకే కదా?"

"గుండ్రాయిలా ఉన్నాను. ఇవాళ కొంచెం ఇల్లు సర్దుతున్నాను. బాబు ఎలా ఉన్నాడు?" అడిగింది.

"బాగున్నాడు. పక్కింట్లో వీడి ఈడు వాళ్ళు ఉన్నారు. వాళ్ళతో స్నేహం కుదిరింది. ఆడుకోడానికి వెళ్ళాడు. పిలవనా? వీడియో కాల్‌లో మాట్లాడతారా?" కోడలు అడిగింది.

"వద్దులేమ్మా. వాడిని ఆడుకోనీ. నా పనయ్యాక చేస్తాలే" ఫోన్ కట్ చేసింది.

పనంతా అయ్యాక వీడియోకాల్ చేసి మనవడితో, కోడలితో మాట్లాడింది. చంద్రం ఆఫీస్‌నించి వచ్చేసమయానికి తయారై, చాలా ఏళ్ళ తర్వాత అతనికి ఎదురెళ్ళింది.

"వావ్! ఎంత బావున్నావో రంభా మేనకలకి మేనత్తలాగా ఉన్నావు" చంద్రం ఆమెని దగ్గరకి తీసుకుంటూ చెప్పాడు.

"చాల్లెండి. మా చిన్నప్పుడు సినిమాల్లో వృద్ధ శృంగారం వస్తే తెగ నవ్వుకునేవాళ్ళం" సిగ్గుపడింది సుజాత.

"అంటే?"

"అంటే, ముసలి జగ్గయ్య, జమున, సత్యన్నారాయణ అంజలీదేవి, గొల్లపూడి అన్నపూర్ణ వీళ్ళ సరసాలు చూడటం చాలా ఇబ్బందిగా ఉండి, నవ్వుకునేవాళ్ళం. ఇప్పుడు మీరు కూడా గుమ్మడిలాగా ...."

"ఏయ్! ఆగాగు. మనం ముసలాళ్ళమా? నీ వయసెంత? ఏభై రెండు. నాకింకో మూడేళ్ళు ఎక్కువ. మనది మధ్య వయసు. ముసలివయసు కాదు" చంద్రం నవ్వుతూ వాదించాడు.

"సరే సరే. ఇవాల్టి ప్రోగ్రాం ఏమిటి?" అతని చేతిలో పూలపొట్లం అందుకుంటూ అడిగింది.

"ఎన్.టి.ఆర్ స్టేడియంలో బుక్ ఎగ్జిబిషన్ ఉందిట. వెళ్దామా?"

"పదండి. బుజ్జిగాడికి పెద్ద బాలశిక్ష కొనాలి" సుజాత అంగీకరించింది.

కొన్ని పుస్తకాలు, బయట అమ్మే పచ్చళ్ళు, చిరుతిళ్ళు కొనుక్కుని వచ్చేసరికి రాత్రి పదిదాటింది.

"ఇంక వర్కింగ్ డేస్ బయటికి వెళ్ళొద్దు. వీకెండ్సే" సుజాత తీర్మానించింది.

ఇప్పుడు సాయంత్రాలు సుజాత చంద్రంతో కలిసి వాకింగ్‌కి వెళ్తోంది. వస్తూ దారిలో ఇంటికి కావలసిన వస్తువులో, కూరగాయలో తెస్తారు. శుక్ర, శనివారాలు సాయంత్రాలు బంధుమిత్రుల ఇంటికి వెళ్తున్నారు. ప్రతీ ఆదివారం తప్పనిసరిగా ఏదొక సినిమాకి వెళ్తారు. రెండు మూడు రోజులు సెలవులు కలిసి వచ్చినప్పుడు అమ్మగారి ఊరికీ, అత్తగారి ఊరికీ వెళ్తున్నారు. వారి మధ్య స్నేహం బాగా పెరిగింది. దాంతోపాటు సన్నిహితత్వం కూడా తరగని కబుర్లు. నిద్రపోయేదాకా మాటలు.

ఆ ఆదివారం ఇద్దరూ కూర్చుని కాఫీ తాగుతూంటే ఫోన్ మోగింది.

"చిన్నా నించి" చెప్పి సుజాత స్పీకర్ ఫోన్ ఆన్ చేసింది.

"అమ్మా ఎలా ఉన్నావు?" చిన్నా అవతల నించి ఉత్సాహంగా అడిగాడు.

"బాగున్నాం నాన్నా. మీరంతా ఎలా ఉన్నారు?" సుజాత ఆప్యాయంగా అడిగింది.

"అమ్మా!" అతనేదో చెప్పబోతూంటే భార్య ఫోన్‌లాక్కుని చెప్పింది.

"అత్తయ్యా. మాకో సమస్య వచ్చింది. మీ సలహాకావాలి."

"సమస్యా? ఏమిటది?" సుజాత కంగారుగా అడిగింది.

చంద్రం ఆదుర్దాగా ముందుకి వంగి ఫోన్ వైపు చూసాడు.

"కంగారు పడకండి. ఆఫీస్ వాళ్ళు మీ అబ్బాయిని దుబాయ్ వెళ్ళమంటున్నారు. పేకేజ్ చాలా బావుంది. మూడేళ్ళ కాంట్రాక్ట్. ఆయనేమో గుజరాత్ వెళ్ళినందుకే మా అమ్మ ఫీలవుతోంది. ఇంక దేశం విడిచి వెళ్ళడం అంటే అస్సలు ఒప్పుకోదు. హైదరాబాద్‌లో నా పాత ఆఫీస్‌లోనే చేరతాను మళ్ళీ అంటున్నారు" కోడలి కంఠంలోని అయిష్టం స్పష్టంగా అర్థమైంది. తల తిప్పి చూసింది. భర్త మొహం నిర్వికారంగా ఉంది.

"అవకాశాలు వచ్చినప్పుడు వాటిని ఉపయోగించుకోవాలి నాన్నా. హాయిగా దుబాయ్ వెళ్ళు. వెళ్ళబోయే ముందు ఓ పదిరోజులు ఇక్కడకి వచ్చి మాతో గడుపు. నీ పుణ్యమా అని మేం కూడా విదేశాలు చూస్తాం."

కొడుక్కి నచ్చచెప్పి సుజాత కన్నీళ్ళని చిరునవ్వు కింద అణిచేసి భర్త వైపు నవ్వుతూ చూసింది.

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments